# శరణు! శరణు!

అనసూయమ్మకి ఏ చిన్న అలికిడయినా, యిట్టే మెలకువ వచ్చేస్తుంది. ఆ తర్వాత మరి నిద్ర పట్టదు. బయట శీతా కాలపు రొజ్జ గాలి జాస్తీ గానే ఉన్నట్టుంది. గదిలో మంచం మీద రగ్గు ముసుగేసుకుని పడుకున్నా, యింకా చలి గానే ఉంది. గదిలోనో, వంటింట్లోనో ఏవో చప్పుళ్ళకి, ఆవిడకి నిద్రా భంగం కలిగింది. కళ్ళు బరువుగా మూతలు పడి పోతున్నాయి. ప్రయత్నం మీద కను రెప్పలు ఎత్తి , పక్క మంచం వేపు చూసింది. ఆయన లేరు. అంటే ఎప్పటి లాగే నిద్ర లేచి, సర్దడాలు, సవరించడాలు మొదలు పెట్టారన్న మాట. ఆ చప్పుళ్ళకే ఆవిడకి మెలకువ వచ్చింది. మరి నిద్ర పట్టదు. తనూ లేవాలి. తప్పదు.

ఈ భాగోతం ప్రతి నిత్యం ఉండేదే. ఊపిరి సలప నంత పనులున్నట్టు, ఉదయాన్నే నిద్ర లేచి పోతారాయన. వంటింట్లో స్టౌ వెలిగించి, చక్కా కాఫీ కాచుకుని తాగందే ఆయనకి తోచదు. కాఫీ సల సలా మరగనిచ్చి, ఆ తర్వాత గ్లాసులో పోసుకుని మరో గ్లాసులో బారెడు ఎత్తు నుంచి పోసుకుంటూ చల్లార్చు కోవడం ఆయన అలవాటు. అలా చేస్తున్నప్పుడు వినిపించే శబ్దం అంటే అనసూయమ్మ గారికి చాలా యిష్టం. ఆ చప్పుడు తనని గోముగా "నిద్ర లేవవే" అని, పిలుస్తున్నట్టు ఉంటుంది. అంత లోనే, "పోనీలే ముసిలీ! మరి కాస్సేపు పడుకో" అని, దయ తలుస్తున్నట్టూ ఉంటుంది. ఆయన మంచం మీద నుంచి లేచి నప్పుడే ఒక్కో సారి తనకి తెలివొచ్చేస్తూ ఉంటుంది. కాని, భర్త వంట గదిలో చేసే చప్పుళ్ళు వినాలనే – మెలకువ వచ్చినా, మంచం దిగదావిడ.

కళ్ళింకా మండుతూనే ఉన్నాయి. రోజూ కన్నా బాగా ముందుగానే లేచి నట్టున్నారాయన. టైమెంతయిందో! చప్పుళ్ళు వంట గది లోనుంచి కాదు. ఇంకా కాఫీ కాచుకున్నట్టు లేదు. మరేం చేస్తున్నారు చెప్మా? అనసూయమ్మ గారు మంచం దిగి, చెరిగిన కొప్పుని వేలు ముడి వేసుకుంటూ ఆసక్తిగా ముందు గదిలోకి వచ్చారు.

అక్కడ –

పుస్తకాల బీరువాలోని పుస్తకాలన్నీ బయటికి తీసి, చుట్టూ గుట్టలుగా పరుచుకుని కూచున్నారాయన. ఆ పుస్తకాల దొంతర్ల మధ్య కూచున్న భర్త సీతాపతి గారిని చూసి, విస్తు పోయింది అనసూయమ్మ. బతుకంతా కష్ట పడి సంపాదించుకున్న అపురూప మయిన ధన రాశుల మధ్య తృప్తిగా కూచున్న పరమ లోభిలా కనిపించేరాయన. ఆ లోభత్వంలో నైచ్యం లేదు. హైన్యం లేదు. గొప్ప తేజో విలసితమైన జ్ఞాన తృష్ణ కనిపించింది.

ఆ పుస్తక సంచయం ఆయన కెంతో ప్రీతి పాత్రం. అదే ఆయన సంపాదించిన ఆస్తి. ఎప్పుడూ ఏదో చదవందే ఆయనకి తోచదు. వయసు పైబడ్డాక, కళ్ళకి యింత మందాన అద్దాలొచ్చేయి. అయినా, ఆయన దిన చర్యలో మార్పు లేదు. ఉదయాన్నే లేవడం. కాల కృత్యాలు తీర్చు కోవడం, కాసేపు జపం చేసుకుని, తర్వాత ఏదో గ్రంథం ముందేసుకుని కూచోడం ... మధ్యాహ్నం భోజనాలయేక, ఓ పది నిముషాలు కాబోలు, నడుం వాలుస్తారు. తర్వాత మళ్ళీ ఏవో పుస్తకాలు తిరగేస్తూ కనిపిస్తారు.రాత్రి జాము పొద్దు పోయే వరకూ వాటితోనే అతనికి కాలక్షేపం. ఆ పిపాస అనసూయమ్మ గారికీ అంటింది. కొద్దో గొప్పో చదవడం ఆవిడకీ అలవాటయింది.భర్త పుస్తక ప్రియత్వాన్ని ఆమోదించిందే కానీ, ఏనాడూ విసుక్కోలేదు. చిరాకు పడ లేదు అయితే, యిప్పుడు మాత్రం భర్త అలా పుస్తకాల గుట్టల మధ్య కూచోడం చూసి, ఆవిడ నొచ్చుకుంది.

"అయ్యో, రామ! ... ఇప్పుడీ దుకాణం పెట్టేరేమిటండీ... వాసు ఫోన్‌లో చెప్పింది గుర్తు లేదూ!" అంది. సీతాపతి గారు భార్య మాటలతో ఆవిడ రాకని గుర్తించి, తలెత్తి చూసారు. "కాసేపు పడుకో రాదూ? నీకెందుకే నిద్రా భంగం!..." "సరే! మాట మార్చకండి... ఇప్పుడీ సర్దడాలు అవీ ఎందుకని... అన్నీ తను చూసుకుంటా నన్నాడు కదా!" భర్త ప్రక్కన పుస్తకాలని కాస్త జరిపి, జాగా చేసుకుని చతికిల పడుతూ అంది అనసూయమ్మ.

సీతా పతి గారు కళ్ళజోడు తీసి, భుజం మీద తువ్వాలుతో అద్దాలు తుడుచుకుంటూ, భార్య ముఖం లోకి చూసేరు. సమాధానం కోసం ఆవిడ తన ముఖంలోకే చూస్తోంది. నిజమే. వాసు ఫోనులో పదే పదే చెప్పేడు: "ఒక్క సామాను కూడా మీరు సర్ద నవసరం లేదు. నేనొస్తాను. పేకర్స్ అండ్ మూవర్స్ వాళ్ళొస్తారు. అన్నీ చక్కగా పేక్ చేస్తారు. మీ రనవసరంగా హైరానా పడకండి. మళ్ళీ ఆయాసం అదీ వస్తే కష్టం. ఏదీ ముట్టు కోకండి...అన్నీ మేం చూసుకుంటాం..." యిదీ ఫోన్‌లో వాడు చెప్పిన దాని సారాంశం. ఈ మాటలే మరీ మరీ చెప్పాడు. ఫోను చేసినప్పుడల్లా మరో మాట లేదు. తనీ వయసులో కష్ట పడి పోవడం వాడికి నచ్చదు.! సీతా పతి గారి ముఖంలో చిరు మంద హాసం తొణికిసలాడింది. ఆ నవ్వులో ఒక సంశయం. ఒక అపనమ్మకం – అనసూయమ్మ గారు పోల్చుకున్నారు.

భర్తకి మొదటి నుండీ యీ ప్రయాణం యిష్టం లేదు. సంవత్సరాల తరబడీ ఉంటున్న ఈ ఇంటినీ, ఈ పరిసరాలనీ విడిచి పెట్టి, సంసారాన్నంతా ఎత్తి పెట్టుకుని, వాసు దగ్గరకి, ఆ మహా నగరానికి మకాం మార్చడం అతనికి సమ్మతం కాదు. కాని తప్ప లేదు. కొన్ని అనివార్యతలు కొన్ని ఆకాంక్షలని అదిమిపెట్టి, తమ ఆధిక్యతని చాటుకుంటాయి, మరి!

సీతాపతి గారు కాసేపు మౌనంగా ఉండి, తర్వాత అన్నారు: "నిజమే అనసూయా!... వాడసలు నన్ను ఏ సామానూ సర్దొద్దని హెచ్చరించేడు..." "అవును కదా!... మరి యిప్పుడీ పుస్తకాల బీరువా అంతా ఖాళీ చేసారేం?" భర్త చేతిని నిమురుతూ అడిగింది అనసూయమ్మ. "ఇవి... ఈ పుస్తకాలు... ఈ పుస్తకాలు సామాను కాదు కదా, అనసూయా!..." భర్త

గొంతులోంచి తడి తడిగా వచ్చిన ఒక్కో మాటా ఒక జలదరింపుకి గురి చేసాయి అనసూయమ్మ గారిని. ఆవిడ యింకేం మాట్లాడుతుంది!

* * *

వీధిలో ఆటో ఆగిన శబ్దం విని, చేతిలో పని వదిలేసి, ఒక్క ఉదుటున వీధి గుమ్మం లోకి వచ్చింది అనసూయమ్మ. ఒక చిన్న జర్నీ బేగ్ చేత పుచ్చుకుని, ఆటో దిగేడు వాసు. ఆ వెనకనే శ్రీలత. అనసూయమ్మ గారి సంతోషానికి అవధులు లేక పోయింది. కొడుకు వస్తూ, తనవెంట కూతుర్ని వెంట బెట్టుకుని రావడం చూసి, ఆవిడ ఆనందంతో తబ్బిబ్బయి పోయింది. తెల్ల పూల చుడీదార్ వేసుకుని, మెడలో ఒంటి పేట గొలుసు, చేతికి వాచీతో మనవరాలు నవ్వుతూ తన వేపే చూస్తోంది.

"నాన్నమ్మా!..." అంటూ ప్రేమగా పలకరించింది. ఆ గొంతులోని మాధుర్యం అనసూయమ్మ గారిని పులకరింప చేసింది. మనవరాలి చేతిని ప్రేమగా అందుకుని, కొడుకుతో "రా, రా! అబ్బాయ్! కోడల్ని కూడా తీసుకు రావల్సింది..." అంటూ యింట్లోకి దారి తీసింది. కొడుకు రాక చూసి, చేతిలోని పుస్తకాలని పక్కన పెట్టి, "వచ్చేవా, వాసూ!" అని పలకరించేరు సీతాపతి గారు. అతని ప్రక్కనే మనవరాలు శ్రీలతని చూసి చాలా సంతోషించారు. "అమ్మా, శ్రీ, రామ్మా..." అంటూ దగ్గరికి పిలిచి తల నిమరేరు. కొడుకు వేపు చూస్తూ "కోడలు రాలేదా?..." అన్నారు. తండ్రి మాటలని మధ్యలోనే తుంచేస్తూ, "ఇప్పుడు తనెందుకు రావడం నాన్నా!... దుమ్మూ ధూళీ పీల్చడానికి కాక పోతే! అసలే తనకి డస్ట్ అలర్జీ... ఇదిగో, దీన్ని కూడా రావద్దనే చెప్పాను.. విన్నాది కాదు. మళ్ళీ తాత గారి ఊరు చూస్తానో, చూడనో అని, శత పోరి, నా వెంట పడింది. ఏం ఉందో యీ ఊళ్ళో చూడ్డానికి... చెప్తే వినిపించుకునే రకం అయితే కదా..." తండ్రి మాట తీరు తనకి అలవాటే అన్నట్టుగా ఆ మాటల్ని పట్టించుకో లేదు శ్రీలత. మురిపెంగా తాత గారి పుస్తకాల దొంతర్ల మధ్య కూచుండి పోయింది.

"అరెరే!.. అక్కడ కూచున్నా వేమిటే... డర్టీ... డర్టీ... బట్టలు పాడయి పోతాయి, చూసుకో వద్దూ.." అని కూతుర్ని హెచ్చరిస్తూ, అప్పుడు గమనించేడు వాసు – తండ్రి ఆ పుస్తకాల గుట్టల నడుమ పాత కాలపు ఉద్గ్రంథంలా ఉన్నాడని. వడిలిన శరీరంతో – దుమ్ము పట్టిన బైండు పుస్తకంలా కనిపించేడతని కళ్ళకి. తండ్రి తీరు ముందు చిరాకునీ , అసహనాన్నీ కలిగించేయి. అది కోపంగా మారి, ఆయన మీద రుస రుసలాడి పోయేడు.

"ఏంటి నాన్నా!... ఏమిటిదంతా... మిమ్మల్నేమీ ముట్టుకో వద్దని చెప్పేను కదా! పేకర్స్ వాళ్ళొచ్చి, అన్నీ వాళ్ళే చూసుకుంటారు... మీ కళా ఖండా లేవీ పాడై పోవు లెండి... యింతోటి ఖజానా ఎవరూ దోచుకు పోరు లెండి... అసలెవరికి కావాలివన్నీ..." కొడుకు మాటలు విని, నిస్సహాయంగా ఎదురు చెప్ప లేక నిరుత్తరులై ఉండి పోయేరు సీతా పతి గారు. శ్రీలత తండ్రినీ, తాత గారినీ మార్చి మార్చి చూస్తోంది. ఆ పిల్లకి తండ్రి నుద్దేశించి ఏదో చెప్పాలని ఉంది. కాని ఏం చెప్పాలో పాలు పోలేదు. వచ్చిన వాళ్ళకి కాఫీ పెడదామని వంటింట్లోకి వెళ్ళిన అనసూయమ్మ గారికి ఆ తండ్రీ కొడుకుల మధ్య పుస్తకాల

విషయమై ఏదో పెద్ద రగడే మొదలయేలా తోచింది. వాసు తండ్రితో ఏదో అంటున్నాడు. వాడాయనతో అంత కటువుగా ఎలా మాట్లాడ గలిగేడో ఆవిడకి అర్థం కాలేదు. వాడు చిన్నప్పటి నుంచీ అంతే! తనేమిటో, తన బాగేమిటో చూసుకోవడం తప్పిస్తే, ఎవరి మనసు ఎలా గాయ పడుతుందనే చింత లేదు.

ఇప్పుడయినా, లోక భీతికి జడిసి, తప్పని సరై తమని పట్నం తీసి కెళు తున్నాడేమో! అక్కడ వీడికి మంచి కంపెనీలో పెద్ద హోదాలో పని. బాగానే సంపాదిస్తున్నాడు. పెద్ద యిల్లు. కావలిసినంత వసతి. ఒకరితో ఒకరికి సంబంధం అక్కర లేదు. తనూ భర్తా ఓ మూల – గదిలో పడున్నా, పట్టనట్టుగా ప్రవర్తించ గలడు. ఆయన ఆలోచిస్తున్నట్టుగా తాము అక్కడికి వెళ్తూ, తప్పు చేయడం లేదు కదా!... యీ ఆలోచన మొదటి సారిగా ఆవెలో కలిగి మనసు కలుక్కుమంది. వాసు తమని, తన దగ్గరికి తీసికెళ్తున్నాడా!... నిజంగా తమని దగ్గరగా, సన్నిహితంగా చేర్చుకో గలడా!... చిన్నప్పటి ఆట వస్తువు పెద్దయ్యాక మళ్ళీ యిప్పుడు దొరుకుతుందా!... కాఫీ కలుపు తూనే భర్త ఏం చెబుతారా అని చెవులు రిక్కించి వింటావిడ.

కాసేపు మౌనం వహించేక: "లేదురా... ఇవీ... ఈ పుస్తకాలన్నీ ఓ క్రమంలో పేర్చుతున్నాను. తీరా పని వాళ్ళువచ్చేక కష్టం కదా... అదీ కాక, వాళ్ళు వీటిని చిందర వందరగా పేకింగ్ చేస్తే యిబ్బందనీ..." "గాడిద గుద్దేం కాదూ!... మేం చూసుకుంటాం – మీరు వెళ్ళి పడుకోండి" ఇలా అనగలగడం కోసం ఎంతలేసి పెద్ద చదువులు చదివేడో! ఎంత పెద్ద ఉద్యోగం వెలగ బెడుతున్నాడో!

ఆ ముసలి దంపతుల కళ్ళలో చెమ్మ మిగిలి ఉంటే, ఓ రెండు చుక్కలయినా రాలి ఉండేవి. అనుకుంది శ్రీలత. అక్కడ ఉండడం యిబ్బందిగా తోచి, వంటింట్లో నాన్నమ్మ ప్రక్కకి చేరింది.

* * *

పది కాకుండా వచ్చేరు పని వాళ్ళు. తమ వెంట చాలా పేకింగ్ మెటీరియల్ తెచ్చుకున్నారు. నలుగురొచ్చేరు. వీధిలో లారీ ఆగి ఉంది. వెంటనే దిగి పోయేరు, పని లోకి. ఏయే సామాన్లు ఎలా సర్దాలో వాళ్ళకి దగ్గరుండి పురమాయిస్తున్నాడు వాసు. అతను చెప్పి నట్టే చక చకా సర్ది, వాటిని అట్ట పెట్టెల్లో పేక్ చేస్తున్నారు.

సీతాపతి గారి మనసు తహ తహలాడి పోతోంది. పుస్తకాలు పేకింగు చేసేటప్పు డయినా తనని దగ్గరకి రానిస్తే బాగుండును. కోపంలో దూర్వాసుడ్ని మించి పోతాడు వాసు! దగ్గరకి రానిచ్చేలా లేదు. మంచం మీద అసహనంగా దొర్లు తున్నారు. అతని అవస్థ గ్రహించి, "మరేం ఫరవా లేదు...అన్నీ సవ్యంగానే జరుగుతాయి!..." అని, భరోసా యిస్తున్నట్టుగా కళ్ళతోటే అనునయించింది అనసూయమ్మ గారు.

సామాన్లు సర్దుతూ ఉంటే శ్రీలత కూడా తండ్రి ప్రక్కనే ఉండి అన్నీ చూసుకుంటోంది.

పేకర్స్ వాళ్ళు వాసు చెప్తున్నట్టుగా సర్దుతూ. ఆ అట్ట పెట్టెల్ని పేకింగ్ రోప్‌తో మిషను మీద గట్టిగా, పదిలంగా బిగిస్తున్నారు. తండ్రి సూచనల మేరకు శ్రీలత ఆ అట్ట

పెట్టెలకి వరసగా నంబర్లివ్వడం, వాటి వివరాలు వేరే నోట్ చేసు కోవడం, పెట్టెల మీద అందులో ఉంచిన సామాన్ల వివరాలు క్లుప్తంగా 'కిచెన్ గూడ్స్', 'వాషింగ్ మెషీన్' అంటూమార్కింగు పెన్నుతో రాస్తోంది. మరో గంటకి దాదాపు యింటెడు సామాను పేకింగు చెయ్యడం పూర్తయింది. మంచం మీద పడుకుని సీతా పతి గారూ, వంట గది ద్వారం ప్రక్కన కుర్చీలో కూర్చుని అనసూయమ్మ గారూ జరుగుతున్న తతంగాన్ని గమనిస్తున్నారు.

తమ ప్రమేయం లేకుండానే -

కొన్ని పదుల సంవత్సరాల నుండీ తమ చేత్తో తడిమిన ఒక్కొక్క వస్తువూ అట్ట పెట్టెల్లో ఖైదీల్లా ఒదిగి పోవడం వారికి చోద్యంగానూ, ఒకింత విషాదంగానూ తోస్తోంది. తప్పదు... ఇవాళో, రేపో జరిగి తీరాల్సిందే యిది! ... అనుభవం అందించిన పెద్దరికంతో దుఃఖాన్ని దిగమింగు కున్నారు కొడుకింట్లో కడ తేరే వరకూ ఒక పిడికెడు గౌరవం, ఆదరణలు లభిస్తే అదే చాలు! ఇద్దరి మనసుల్లోనూ మెదులుతున్న ఆలోచన యిదే!

కొడుకు తీరు తొలి నుంచీ తెలిసిందే. ఒక మంచీ లేదు. ఒక చెడ్డా లేదు. పెద్దా లేదు. చిన్నా లేదు. ఒట్టి కోపిష్ఠి మనిషి. ఇక కోడలు ...చెప్పుకోడానికేం లేదు. పెళ్ళయి నప్పటి నుండీ తమతో నోరు విప్పి మాట్లాడడమే గగనం. ఆ యింట్లో ఈ వయసులో తాము యిమడ గలరా? ఇద్దరికీ బయటకి చెప్పుకో లేని విధంగా వేధిస్తున్న ప్రశ్నలివి... అందుకే తమతో వచ్చెయ్యమని, వాసు లోగడ ఎన్ని సార్లు అడిగినా, సున్నితంగా దాట వేసారు. మరిప్పుడు తప్పింది కాదు. ఈ కారు చీకటిలో కాంతి రేఖ ఏదయినా ఉందంటే – ఒక్క మనవరాలు... శ్రీలత.! ఏమో, అది కూడా ఆ గూటి చిలుక అయి పోదు కదా!

సామాన్ల పేకింగు దాదాపు పూర్తి కావచ్చింది. ఇక పుస్తకాల వంతు వచ్చింది. సామాన్లు పేకింగు చేయించేటప్పుడు వాసు వాటిని రెండు రకాలుగా విభజించేడు. పనికొచ్చేవీ. పనికి రానివీ. పనికి రావనుకున్న వాటిని కూడా పేక్ చేయించి, శ్రీలత చేత వివరాలు నమోదు చేయించి, ఆ పెట్టెలకీ నంబర్లు వేయించాడు. పట్నం తీసికెళ్ళే సామాన్లలో వాటికి స్థానం లేదు. అలాంటి పెట్టెలు అయిదారయ్యేయి. వాటిని, సొంతిల్లే కనుక – యింట్లో పని వాళ్ళ చేత అటక మీద పెట్టిస్తున్నాడు. వాటిని తమతో తీసికెళ్ళే ప్రసక్తి లేదు.

పుస్తకాల సంగతీ అంతే -

చదువుకునే రోజుల్లోనూ, తరవాతా చాలా వెచ్చించి తన కెరీర్‌కి పనికొచ్చే పుస్తకాలు కొన్నాడు వాసు. కాంపిటేటివ్ పరీక్షలకి పనికొచ్చే పుస్తకాలూ చాలా ఉన్నాయి. అవి కాక, వ్యక్తిత్వ వికాస గ్రంథాలూ, ఒకటో, రెండో శబ్ద కోశాలూ ఉన్నాయి. చవక బారు నవలలూ కొద్ది పాటి ఉన్నాయి. అవన్నీ వాసు కొన్నవే. ఆ పుస్తకాలన్నీ కలిపి ఒక బాక్సులో పేక్ చేయించేడు. మిగిలిన పుస్తకాలన్నీ వేరే పెట్టెలలో సర్దించాడు. అవి తండ్రి చదివే పుస్తకాలు. తండ్రి అపురూపంగా కొనుక్కున్న పుస్తకాలు. పాత చింతకాయ పచ్చళ్ళు. పుస్తకాలు సర్దడం మొదలయిన దగ్గరనుంచీ సీతా పతి గారు స్థిమితంగా మంచం మీద పడుకో లేదు. లేస్తునారు. కూచుంటున్నారు. వాసుకి ఏదో చెప్పాలని తటపటాయిస్తున్నారు.

ధైర్యం చాలడం లేదు. తనకెంతో ప్రీతి పాత్రమయిన పుస్తకాలు.. భారత భాగవతాలు... ప్రబంధ, శతక సాహిత్యాలు... కొన్ని తొలితరం ఆధునిక రచయితల కలాల నుండి జాలు వారిన అపురూప సాహిత్య గ్రంథాలు... గద్యం... పద్యం... గేయం.. కవిత్రయం నుండి కరుణశ్రీ వరకూ... ఎన్నెన్ని మంచి పుస్తకాలు! తనెంతగానో యిష్ట పడే నవలా సాహిత్యం ... కథా సంపుటాలు ... ఒకటా, రెండా! చెప్పుకుంటే చేంతాడంత! వాసు దృష్టిలో ఇదంతా పనికిమాలిన చెత్త! వీటి వల్ల ఎర్ర ఏగాణీ సంపాదించ లేం! కూడు పెట్టేనా, గుడ్డ పెట్టేనా! ఉత్త బోర్! ... పాత చెత్త! అవీ యివీ అనకుండా దొరికిన అన్ని మంచి పుస్తకాలూ చదవడం సీతాపతి గారికి అలవాటు. ప్రాచీనం, ఆధునికం అన్న తేడా లేదు. అన్ని వేపుల నుంచీ ప్రసరించే అన్ని పవనాలనీ సుగంధాలనీ ఆస్వాదించేరు. అవకాశం ఉన్నంత మేరకు, శక్తి కొద్దీ వాటిని సేకరించారు. అలా పోగయిన పుస్తక సంచయమే అది!

వాసు వాటిని యిప్పుడేం చేయబోతున్నాడు ?

ఒక కలవరపాటు సీతాపతి గారిని కుదిపేస్తోంది. ఒక చేతగాని తనం క్రుంగ దీస్తోంది.

సమాధాన పడడమే కదా, వార్ధక్యం నేర్పించే తొలి చేదు పాఠం!

* * *

అనుకున్నంత పనీ అయింది!

సీతా పతి గారికి ప్రియమైన పుస్తకాలున్న అట్ట పెట్టి అట కెక్కింది. ఇల్లు అమ్మకం జరిపినప్పుడు తేవొచ్చని - వాసు అన్నప్పుడు, ఆ తండ్రి హృదయం చెక్కలై చెమ్మగిల్లింది. వాటిని తమతో పట్నం తీసికెళ్ళాలని అతని ఆరాటం. అది జరిగే పని కాదని, తెలిసి పోతూనే ఉంది. చివరికి అటక మీద ఆ పుస్తకాల గతి చెదలు పట్టి, చిరిగి పోవడమే అని అర్థమయే సరికి - సీతా పతి గారిలో అంత వరకూ మిణుకు మిణుకు మన్న చివరి ఆశా లేశం కూడా అణగారి పోయింది.ఇదంతా చూస్తున్న అనసూయమ్మ గారు కూడా ఏమీ మాట్లాడ లేక పోయేరు.

అసమర్థతలో ఎంత విషాదం గూడు కట్టుకుని ఉంటుందో జీవితంలో తొలి సారిగా అనుభవించేరు సీతా పతి గారు. గుండె గొంతుకలో కొచ్చి నీరసంగా కొట్టుకుంది.

పని వాళ్ళు సామాన్ల పెట్టెలు లారీలోకి ఎక్కించడం మొదలు పెట్టారు. వాసు దృష్టిలో పని రాని వస్తువులున్న పెట్టెలని అటక మీద సర్దేరు. పని పూర్తయింది. లారీ బయలు దేరింది.

* * *

పట్నం వచ్చి, వారం గడిచింది.

ఆ పెద్ద యింట్లో తల్లికీ తండ్రికీ ఓ మూల గది కేటాయించేడు వాసు. వచ్చిన తొలి నాళ్ళలో ఓ సారో, రెండు సార్లో తప్ప - మరింక ఆ ఛాయలకి రావడం లేదు వాసు. కోడలు సరే సరి! వేళకి తిండీ తిప్పలు అమిరి పోతున్నాయి. మందులకీ, మాకులకీ

కొదవ లేదు. పని వాళ్ళు తెచ్చి పెడుతున్నారు. గదిలో రెండు ఫేన్లు, ఓ చిన్న టీవీ ఉన్నాయి. వేసం కాలం వచ్చేక ఏసీ పెట్టిస్తాట్ట! అంతా బాగానే ఉంది.

అంతా బాగానే ఉందా? అసలు తమకి ఊపిరాడుతోందో, లేదో! ఆ దంపతులకి వారి స్థితి వారికే అగమ్య గోచరంగా ఉంది. సామాన్లు సర్దించే టప్పుడు – కావాలనే వాసు కొన్ని అట్ట పెట్టెలను తెరిపించ లేదు. అవసరం లేదనుకున్న వాటిని అలాగే ఉంచేడు. పుస్తకాల పెట్టెని సీతాపతి గారి రూంలో పెట్టించాడు. తీరిగ్గా దాన్ని తెరిచి, కావలసిన వాటిని ఉపయోగించుకోమని శ్రీలతకి చెప్పేడు. అవన్నీ ఆమె కెరీర్‌కి బాగా దోహదం చేస్తాయని హెచ్చరించేడు.

సీతాపతి గారికీ, అనసూయమ్మ గారికీ రోజులు నిస్సారంగా గడుస్తున్నాయి.

* * *

ఆ సాయంత్రం ...

మంచం మీద ప్రక్కనే కూచుని, "తాతయ్యా!" అని శ్రీలత పిలుస్తూ ఉంటే, కళ్ళు తెరిచి చూసేరు సీతాపతి గారు. తర్వాత చాలా సేపు తాతా, నాయనమ్మలతో ఆ కబుర్లూ యీ కబుర్లూ చెప్పింది. చాలా రోజుల తర్వాత ప్రాణం లేచొచ్చినట్టయింది వారికి.

ఉన్నట్టుండి, ఏదో గుర్తొచ్చినట్టు అడిగింది శ్రీలత: "తాత గారూ!... మొన్నా మధ్య మా కాలేజీలో తెలుగు భాషా సంఘం వాళ్ళు వచ్చి, ఏదో కార్యక్రమం చేసారండీ...కొంత అర్థం అయింది. కొంత కాలేదు. మన భాషని మనం కాపాడు కోవాలిట!... లేక పోతే, అది చచ్చి పోయే రోజు ఎంతో దూరంలో లేదుట... నాకేం అర్థం కాలేదు... తెలుగు చచ్చి పోవడమేవిటండీ తాత గారూ! మనందరం మాట్లాడుతూనే ఉన్నాం కదా!..." ఆ మాటల్లో అమాయకత్వం చూసి, నవ్వొచ్చింది సీతాపతి గారికి... మనవరాలిని మరింత దగ్గరకి తీసుకుని, ఆదరంగా అన్నారు: "శ్రీ! నీకు తెలుగు ధారాళంగా మాట్లాడడం వచ్చు... ఒప్పుకుంటాను... మరి, తెలుగు పుస్తకాలు చదవడం, తెలుగులో రాయడం కూడా వచ్చునా, మరి?' తాత గారి ప్రశ్నకి తెల్లబోయింది శ్రీలత. ఆ తాతా మనవరాళ్ళ మాటల్ని ఆసక్తిగా గమనిస్తోంది అనసూయమ్మ గారు. "రాదు కదా!... అదే మరి!... తెలుగు భాష చచ్చి పోవడమంటే..." శ్రీలత నిర్ఘాంత పోయింది, ఆ మాటలతో.

తప్పెవరిదో, యీ స్థితికి కారకు లెవరో ఆ పిల్లకి వెంటనే స్ఫురించ లేదు. అయోమయంగా చూసింది.

"మరెలా?.." బేలగా అడిగింది.

ఆమె లోని అలజడిని గుర్తిస్తున్నట్టుగా, ఓదార్పుగా అన్నారు సీతాపతి గారు: "ఈ తరం పిల్లలు తెలుగులోని మంచి పుస్తకాలని చదవడం అవసరమమ్మా... మాట్లాడడమే కాదు... చదవడం, రాయడం చేయాలి. తెలుగు భాషా సాహిత్యాల మీద మక్కువ పెంచు కోవాలి... ఏమయినా, చులకన భావం, అనాదరణ ఉంటే వాటిని విడిచి పెట్టాలి... మన ఉనికినీ, మన భాష ఉనికినీ కాపాడు కోవాలంటే యిదే మన తక్షణ కర్తవ్యం..."ఉపన్యాస ధోరణిలో సాగాయి ఆయన మాటలు. అప్పుడు తటాలున గుర్తొచ్చింది, శ్రీలతకి – తనా

గది లోకి వచ్చిన పని! తాత గారి మంచం ప్రక్కన పేర్చి ఉన్న అట్ట పెట్టెల్లో ఒక దాని నంబరు సరి చూసుకుని, దాన్ని యివతలకి లాగింది. వెంట తెచ్చు కున్న కత్తెరతో పేకింగ్ రోప్‌ని తెంచి, పెట్టె తెరిచింది. సీతాపతి గారి కళ్ళు మిలమిలా మెరిసాయి!

"ఇదెలా సాధ్యమయిందమ్మా, నీకు!..." అతని గొంతులో ఉద్విగ్నత. "నంబరు మేజిక్కు తాత గారూ!... మార్కరు పెన్నుతో అంకెలని మార్చడం కష్టం కాదు కదా! ఒకటిని నాలుగుగా, మూడుని ఎనిమిదిగా... యిలా!- పాపం, పూర్ డాడీ, కనిపెట్ట లేకపోయేరు!" అంది మనోహరంగా నవ్వుతూ . "తప్పు కదమ్మా!..." లాలనగా అడిగారు తాతగారు.

"నాటెటాల్! టిట్ ఫర్ టాట్!... మీ నిధి మీ కొచ్చింది.. నిస్సంకోచంగా స్వీకరించండి తాత గారూ! మా డాడీ మమ్మీలు ఈ గది ఛాయలకి వచ్చేదే లేదు! ... వచ్చినా, మునిగి పోయేదేం లేదు.' హాయిగా మీ పుస్తక నేస్తాలతో కబుర్లు చెప్పుకోండి!' ఆ పిల్ల మాటల్లో ఒక విసురు! ఒక పెంకె తనం!

ఎంతయినా యీ తరానికి ప్రతినిధి కదా!

"మంచిదమ్మా!...నా నిధి నాకిచ్చేవు...మరి దీన్ని భద్ర పరుచుకో వలసినదీ, ఉపయోగించవలసినదీ... మీ తరమే సుమా!..." శ్రీలత తల ప్రేమగా నిమురుతూ అన్నారు సీతాపతి గారు.

* * *

*నవ్య వార పత్రిక 2008 దీపావళి ప్రత్యేక సంచికలో ప్రచురణ.*